www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 నవంబరు 2022
5
ఏలూరు



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, బూరుగుగూడెం, కోటపాడు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని బూరుగు గూడెం, కోటపాడులో ఎపి కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, చాట్రాయిలో వైసిపి నాయకులు దామెర ప్రసాద్‌బాబు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రాఘవరెడ్డి మాట్లాడుతూ మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ మాట్లాడుతూ ధాన్యంలో తేమ 17 శాతం ఉండాలని, 'ఎ' గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2060కు, సాధారణ రకాలకు రూ.2040 చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పాండురంగారావు, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్, ఇఒపిఆర్‌డి ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా..!

అధ్వానంగా జగనన్న లేఅవుట్లు - సమీక్షలతోనే సరి - ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సామాన్యుడి కలల సౌధం కలగానే మిగిలిపోతుంది.. ఏళ్లు గడుస్తున్నా జగనన్న లేఅవుట్లలో నివాసాల నిర్మాణాలు చేపట్టడం లేదు. ఎన్నికల తరుణం కూడా దగ్గరపడుతోంది. దీంతో ఈ ఎన్నికలనాటికైనా సొంతింటి కల నెరవేరుతుందా? అని సామాన్యుడు ఆశతో ఎదురుచూస్తున్నాడు.



ఏలూరు జిల్లాలో 88,952 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 758 లే అవుట్లలో 60,414, సొంతస్థలాల్లో నిర్మించుకునేందుకు మరో 28,538 మంజూరయ్యాయి. గృహ నిర్మాణశాఖాధికారుల లెక్కల ప్రకారం ఇందులో 11,143 ఇళ్లు పూర్తయ్యాయి. 54,803 బిలో బేస్‌మెంట్ లెవిల్‌లో, మరో 9,244 బేస్‌మెంట్ స్థాయిలో, 3,312 రూఫ్ స్థాయిలోను, 5640 స్లాబ్ లెవిల్‌లో ఉన్నట్లు చెబుతున్నాయి. 4,810 ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కానీ ఈ లెక్కలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నట్లు వాస్తవ పరిస్థితులు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ఒక్క నివాసం కూడా మొదలుకాని లేఅవుట్లు జిల్లాలో అనేకం దర్శనమిస్తుండడం ఈ లెక్కల్లో డొల్లతనాన్ని బయటపెడుతోంది. వాస్తవానికి అధికశాతం మంది నివాసాలు మొదలుపెట్టకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కరోనా సమయం నుంచి ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండడం, నిర్మాణ సామగ్రితో పాటుగా కూలీల రేట్లకు రెక్కలు రావడం ప్రధానంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తొలుత గృహ నిర్మాణదారులకు మూడు ఆప్షన్లను ఇచ్చింది. వినియోగదారుడు తనకు కావాల్సిన విధంగా నిర్మించుకుంటే దానికి తగిన విధంగా బిల్లులు మంజూరు చేయడం ఒకటికాగా, ప్రభుత్వం ఇచ్చిన మెటీరియల్‌తో ఇంటి నిర్మాణం చేపట్టుకునేలా రెండో ఆప్షన్ ఉంది. ఇక మూడోది ప్రభుత్వమే ఇంటిని నిర్మించి అప్పగించేలా అంగీకార పత్రాలను కూడా తీసుకుంది. ఇందులో దాదాపుగా 80 శాతం మందికి పైగా ప్రభుత్వమే ఇల్లు నిర్మించి తమకు అప్పగించేలా వినియోగదారులు అంగీకరించారు. దానికిగానూ వాలంటీర్లు చెప్పిన విధంగా బ్యాంకుల్లో ఖాతాలను కూడా తెరిచారు. కానీ ఇది జరిగి నెలలు గడుస్తున్నా దానికి సంబంధించిన పనులు ఒక్కటి కూడా ప్రారంభం కాలేదని చెప్తారు. ఆ తర్వాత మూడో ఆప్షన్లను ప్రభుత్వం తొలగించింది. దీంతో చాలామంది లబ్ధిదారులు అసలు తమకు ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసిందనే విషయాన్ని కూడా మర్చిపోయే పరిస్థితి నెలకొంది. దానికితోడు గృహాలకు సంబంధించి పదేపదే సమావేశాలను నిర్వహించడం కూడా లబ్ధిదారులకు విసుగును తెప్పిస్తోంది.

అధ్వానంగా లేఅవుట్లు..


ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా లేఅవుట్లు బురదమయంగా మారాయి. కొన్ని లేఅవుట్లలో నీరు చేరి చెరువులను తలపించాయి. రోడ్లు కూడా బురదమయంగా మారాయి. చాలాచోట్ల లేఅవుట్లలో ఇంకా రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ వంటి పనులు సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి చేసిన తర్వాతే నివాసాల పనులను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దెందులూరు మండలంలో 3,523 మందికి జగనన్న ఇళ్లు మంజూరు కాగా 1,020 మాత్రమే పూర్తయ్యాయి. ఆర్థిక ఇబ్బందులతో 1100 ఇళ్లు, ఇసుక లేకపోవడంతో 1403 ఇళ్లు నిలిచిపోయాయి. మిగిలిన వారు ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించే సాహసం చేయడం లేదు. ఇళ్లు కట్టుకోలేని వారికి తామే ఇళ్లు కట్టించి పెడతామని ప్రభుత్వం ప్రచారంలో ఉదరగొట్టారు. తీరా ఇళ్లు ప్రారంభించాలని లబ్ధిదారుల నుంచి ఒత్తిడి రావడంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాలంటీర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా మీరే ఇళ్లు నిర్మించుకోవాలని ఇసుకను ప్రతి గ్రామంలో ర్యాంపులను ఏర్పాటు చేసి ఇసుక అందిస్తామన్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు ప్రారంభించారు. తర్వాత ఆన్‌లైన్‌లో రాజమండ్రి, చేబ్రోలు, సిద్ధాంతంలో మాత్రమే ఇసుక ఇస్తారని చెప్పడంతో రవాణా ఛార్జీలు వెచ్చించి ఇసుక తెచ్చుకున్నారు. అయితే సరిపడనంత ఇసుక లేకపోవడంతో ఇళ్లు ఏ విధంగా కట్టుకోవాలో తెలియక తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ప్రభుత్వం విడతల వారీగా రూ.లక్షా 80 వేలు ఇస్తున్నా మరో రూ.ఎనిమిది లక్షలు లేనిదే ఇల్లు పూర్తి గాని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

కక్షి దారుల నుంచి విశేష స్పందన
ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు

రాజీమార్గంలో సామరస్యంగా పలు కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఏలూరు జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ముందు న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇరువర్గాలకు రాజీమార్గం కుదిర్చి సామరస్యంగా కేసును పరిష్కరించాలన్న ముఖ్య ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సామరస్యంగా పరిష్కరించుకోదగ్గ కేసులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఆయా పరిస్థితుల ప్రభావం వల్ల కోర్టు కేసుల్లో ఉన్న కక్షిదారులు కోర్టు కేసుల నుండి విముక్తి పొంది సంతోషంగా జీవించడానికి లోక్ అదాలత్ ఏర్పాటు చేశారన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి వీలైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, మోటార్ వాహనాల చట్టం కింద నమోదైన ప్రీ లిటిగేషన్ కేసులను ఇరువర్గాల సమక్షంలో సమన్వయ పద్ధతిలో రాజీకుదిర్చి పరిష్కరిస్తామన్నారు. పెండింగ్ కేసులు తగ్గడమే కాకుండా కక్షిదారులకు ఆర్థికంగా భారం తగ్గి సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఉమాసునంద, ఏడో అదనపు జిల్లా జడ్జి పి.మంగ కుమారి అదాలత్ ప్రయోజనాలను, ప్రమాదాల సమయంలో నష్ట పరిహారం పొందే అంశాల గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 32 బెంచ్‌లను ఏర్పాటు చేశామని, ఏలూరు జిల్లా కోర్టులో ఎనిమిది బెంచ్‌లు లోక్ అదాలత్‌కు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత లోక్ అదాలత్‌లో 5,665 కేసులు పరిష్కరించామన్నారు. క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదా, వాహన ప్రమాద, బ్యాంకు వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్, అగ్రికలర్ ఐటీఎల్, మున్సిపల్ ట్యాక్స్‌లకు సంబంధించి చిన్న కేసులు అదాలత్‌లో ఎనిమిది బెంచ్‌ల ద్వారా కేసులు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాహన ప్రమాద నష్టపరిహారం కింద న్యూ ఇండియా బీమా కంపెనీ ద్వారా రూ.40 లక్షల నష్టపరిహార చెక్కును కక్షిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు బివి.కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు టిఎస్ఎస్ఎన్.రెడ్డి పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్మికులు

విలీన పంచాయతీ కార్మికుల
బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల కార్మికులకు మూడు నెలల జీతాలు, ఒహెచ్ఎస్‌తో కలిపి తక్షణం చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం నగర కార్పొరేషన్ కమిషనర్ షేక్ షాహిద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు నాలుగు నెలల హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. మూడేళ్లుగా బకాయి ఉన్న యూనిఫారాలు, సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె, కుట్టు కూలి మంజూరు చేయాలని కోరారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు పనిముట్లు, తోపుడు బండ్ల ప్రిన్స్ డబ్బాలు సరిగా పనిచేయట్లేదని వాటి స్థానంలో కొత్త పనిముట్లు సమకూర్చాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఏలూరు యూనియన్ నగర అధ్యక్షులు కసింకోట నాగేంద్ర, ఉపాధ్యక్షులు ఇంటి అశోక్, బంగారు దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు దొడ్డిగర్ల నాగబాబు, బంగారు కృష్ణ, పంతం శోభన్‌బాబు, అల్లం పెద్దిరాజు, ప్రవీణ్, నాగబాబు, మహేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.



వేగంగా జరుగుతున్న కల్వర్టు పనులు

శరవేగంగా తల్లాడ-దేవరపల్లి రోడ్డు పనులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తల్లాడ - దేవరపల్లి జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా కొయ్యలగూడెం నుండి జీలుగుమిల్లి వరకూ చేపట్టిన నేషనల్ హైవే 516-డి పనులు శరవేగంగా సాగుతున్నాయి. 23 కిలోమీటర్ల మేర రూ.74 కోట్లతో రహదారిని 12 మీటర్ల వెడల్పుతో (ఇరువైపులా మీటర్ వెడల్పుతో మార్జిన్) నిర్మిస్తున్నారు. ఇప్పటికే రహదారి నిర్మాణ పనులు 80 శాతం పూర్తి కాగా కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం - జంగారెడ్డిగూడెం మధ్య ఉన్న పులివాగు వంతెన వద్ద పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం పులి వాగు వంతెన వెడల్పు ఎనిమిది మీటర్లు ఉండగా దాన్ని 16 మీటర్లు పెంచుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి రూ.కోటీ 25 లక్షలు మంజూరయ్యాయని, 18 చోట్ల కల్వర్టులు నిర్మిస్తామని తెలిపారు. 2023 ఫిబ్రవరి నెలాఖరుకు కల్వర్టులతో సహా రోడ్డు నిర్మాణం నూరు శాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఉత్కంఠగా చెడుగుడు పోటీలు

టిడిపి నేత కొడాలి వినోద్ ఆధ్వర్యాన క్రీడాకారులకు భోజన వసతి

ప్రజాశక్తి - ముదినేపల్లి


మండలంలోని బొమ్మినంపాడులో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఈ పోటీలు మూడో రోజు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో అన్నాక్యాంటీన్ ద్వారా క్రీడాకారులకు, సందర్శకులకు, గ్రామస్తులకు భోజనాలు అందించారు. చెడుగుడు పోటీలకు హాజరౌతున్న క్రీడాకారుల సౌకర్యార్థం మూడు రోజులుగా అన్నక్యాంటీన్ నిర్వహిస్తున్నారు. శనివారం 400 మందికి భోజనాలు అందించారు. పోటీల ముగింపు రోజు ఆదివారం కూడా అన్నక్యాంటీన్ నిర్వహిస్తామని వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, పార్టీ నాయకులు బొర్రా చలమయ్య, యర్రా రాంబాబు, శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, కె.విఠల్, వి.నరసింహారావు పాల్గొన్నారు.



క్రీడాకారులకు భోజనాలు వడ్డిస్తున్న వినోద్

ఆదివాసీ ఉద్యోగులపై దాడులను అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఎస్ఐ సాగర్‌బాబుకు వినతిని అందిస్తున్న నాయకులు

ఆదివాసీ ఉద్యోగులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని ఆదివాసి ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్ మొడియం శ్రీను డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీ ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీ ఉద్యోగి ఎంఇఒ బి.రాముడుపై స్థానిక వికాస్ పాఠశాల కరస్పాండెంట్ జగన్నాథరావు చేసిన దౌర్జన్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఉద్యోగ సంఘాల జెఎసి ఛైర్మన్ మాట్లాడుతూ ఇటీవల వికాస్ పాఠశాల కరస్పాండెంట్ జగన్నాథరావు పాఠశాల అనుమతుల కోసం ఎంఇఒ రాముడుపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జగన్నాథరావును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ ఉద్యోగ సంఘాల జెఎసి సభ్యులు నిరసన ర్యాలీ నిర్వహించి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఆనంతరం స్థానిక ఎస్ఐ సాగర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ గిరిజన సంక్షేమ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం పోసియ, వైసిపి టీచర్స్ అసోసియేషన్ నాయకులు కందుల ప్రకాష్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సోదింరాజు, దేవర దీవెనరావు పాల్గొన్నారు

ఉత్సాహభరితంగా విద్యార్థుల వనసమారాధన

ప్రజాశక్తి - పెదవేగి




భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కవ్వకుంట గ్రామంలోని రెడ్డి గార్డెన్స్‌లో న్యూ జనరేషన్ హై స్కూల్ యాజమాన్యం విద్యార్థులతో నిర్వహించిన వన సమారాధన ఉత్సాహభరితంగా సాగింది. నిరంతరం చదువుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సతమతమవుతున్న నేపథ్యంలో ఆటవిడుపు కోసం విద్యార్థులను వన సమారాధనకు తీసుకువచ్చామని స్కూల్ డైరెక్టర్ ఎన్ఆర్‌కెవి.ప్రసాద్ అన్నారు. నిరంతరం విద్యతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతూ ఉంటారని విద్యార్థుల్లో ఆలోచనా విధానాలను మార్చి ఆటల పాటలవైపు దృష్టిని మరల్చేందుకు వన సమారాధన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బేబీ, వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ డే

ఏలూరు నగర్ కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



ఇళ్ల నిర్మాణ మ్యాపును పరిశీలిస్తున్న కమిషనర్ షాహిద్

జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పనపై గృహ నిర్మాణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని నగర్ కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. చోదిమెళ్లలోని ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత అధికారులతో కలిసి శనివారం కమిషనర్ ఇళ్ల కాలనీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. కాలనీలో ఇప్పటికే విద్యుత్, నీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతులను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బేస్‌మెంట్ స్థాయిలోనే ఎగుడు దిగుడు లేకుండా క్రమ పద్ధతిలో సమాంతరంగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వహకులకు కమిషనర్ సూచించారు. రెండు పూటలా ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకూ వాటరింగ్ చేస్తూ ఉండాలన్నారు. లబ్ధిదారుల నుండి ఫిర్యాదు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను, ఏజెన్సీల నిర్వాహకులను కమిషనర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన బ్రిక్స్, ఐరన్, ఇసుక, సిమెంట్ కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్మాణాలు త్వరితన పూర్తయ్యేందుకు అధికారులు సచివాల సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులను కమిషనర్ షాహిద్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్, గృహ నిర్మాణ శాఖ డిఇ సుధారాణి, విద్యుత్ శాఖ ఎఇ శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఎఇ రఫీ, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మాధవి, సచివాలయ, హౌసింగ్, ఇంజినీరింగ్, కాంట్రాక్ట్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దులో నిర్లక్ష్యం తగదు


ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సిపిఎస్ రద్దు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సిపిఎస్ సాధన సమితి (యుటిఎఫ్) జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ కమల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కొయ్యలగూడెంలోని టీచర్ల సొసైటీ భవనంలో మండల మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దయ్యే వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, కొయ్యలగూడెం యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రేణుకాదేవి, మరపట్ల ఈశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.విక్టర్, మండల గౌరవ అధ్యక్షులు ఎస్.రమేష్‌బాబు, జంగారెడ్డిగూడెం డివిజన్ కన్వీనర్ షరీఫ్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెలపై కుంపటి ఎన్నాళ్లు..!

కడియద్ద ఘటనతో మరోసారి తెరపైకి బాణసంచా ప్రమాదాలు
ఆకివీడు, పెదవెల్లమిల్లి ఘటనలపై సర్వత్రా చర్చ
ధాన్యం కొనుగోళ్లు ఇలాగేనా

'కడియద్ద' ఘటన నాలుగు శ్రమజీవుల ప్రాణాలను బలిగొంది. అదే సమయంలో అన్ని అధికారిక వ్యవస్థల పర్యవేక్షణా లోపాలను ఎత్తిచూపింది. అప్పుడే కునుకు తీసేందుకు సిద్ధమవుతున్న పల్లెలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో సమీప ప్రాంతాలన్నీ భూకంపం వచ్చినట్లు దద్దరిల్లాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఘటన జరిగిన వెంటనే సమీపప్రాంత ప్రజలు కూడా వెళ్లేందుకు సాహసించలేని పరిస్థితి నెలకొనడం వెనుక అన్ని అధికారిక వ్యవస్థల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. గతంలో పెదవెల్లమిల్లి, ఆకివీడు తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న బాణాసంచా పేలుడు ఘటనలు చోటుచేసుకోవడం, మరణాలు సంభవించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ సమయంలోనూ విచారణ పేరిట హడావుడి చేయడం ఆపై అంతా మరిచి పాత పరిస్థితులే కొనసాగుతున్నాయనడానికి కడియద్ద ఘటనే నిదర్శనం. అన్నిచోట్లా అక్కడ పనికొచ్చిన కూలీలే మృత్యువాత పడుతున్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే ఎక్స్‌గ్రేషియా మినహా మరే సాయమూ లేక ఆయా కుటుంబాలకు రోడ్డున పడుతున్నాయి. బాణసంచా తయారీ, నిల్వకు అక్కడ అనుమతి ఉందని అంతా చెబుతున్నారు. అది వాస్తవమే అయ్యి ఉండొచ్చు. అంటే పేలుడు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చేయకుండానే అధికారులు అనుమతులిచ్చేశారా. అలాగైతే గుడ్డిగా అనుమతులిచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. లేక అన్ని ఏర్పాట్లు చేసినా పేలుడు సంభవించిందా అంటే దానికి గల కారణాలను వెలికితీయాలి. ప్రాథమిక సమాచారం ఆధారంగా పరిశీలిస్తే సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే కాకుండా అనుమతులకు మించిన సామర్థ్యంతో అక్కడ పేలుడు సామగ్రి



ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖాధికారులు ఏం చేస్తున్నారో తేల్చాలి. పోనీ సంబంధిత అధికారులంతా ఆ యజమానిని హెచ్చరించినా చర్యలు తీసుకోకుండా రాజకీయ పెద్దల జోక్యం ఉంటే ఆ విషయాన్ని బట్టబయలు చేయాలి. అదేమీ లేకుండా సామర్థ్యానికి మించి నిల్వలున్నాయని ఒకరిద్దరు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే శ్రమజీవుల ప్రాణాలకు విలువ లేకుండా చేసినట్లే. ఇప్పటికైనా దీనిపై లోతుగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి అధికారిక వ్యవస్థల్లో లోపాలను సరి చేయడంతోపాటు రాజకీయ పెద్దల జోక్యాన్ని నివారించేలా చర్యలు తీసుకుంటే ఈ ఘటనలు పునరావృతం కాకుండా, కూలీల ప్రాణాలు బలికాకుండా ఉండే అవకాశం ఉంది. మరి పాలకులు, జిల్లా అధికారులు ఎలా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ధాన్యం కొనుగోళ్లు ఇలాగేనా

సార్వా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. చాలాచోట్ల కోతలు ప్రారంభమై 20 రోజులు దాటింది. అయితే ధాన్యం మాత్రం కల్లాలు దాటి ఆర్‌బికెలకు చేరడం లేదు. ప్రధానంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడమే దీనికి కారణం. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన ఉంగుటూరు మండలంలో ఆదిలోనే హంసపాదులా సాంకేతిక సమస్యలు అటు రైతులను, ఇటు అధికార యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇప్పటికే రైతులు 20 రోజులుగా ఒకపక్క వాతావరణ మార్పులు, మరోపక్క ధాన్యం ఎక్కడ అమ్మాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతిక సమస్యలు రైతులకు గోరుచుట్టుపై రోకటి పోటులా పరిణమించాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సాంకేతిక సమస్యలు పరిష్కరించడంతోపాటు నిబంధనలు సడలించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతోపాటు ఆర్‌బికెలకు ధాన్యం అప్పగించిన 15 నుంచి 20 రోజుల్లేనే సొమ్ము ఖాతాల్లో జమైతే రైతులకు ఎంతోకొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకుంటారో లేక దాళ్వా సీజన్ తరహాలోనే రైతుల గుండెపై కుంపటి రగిలిస్తారో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



కొయ్యలగూడెంలో నిరసన..

మోడీకీ రాష్ట్రంలో పర్యటించే హక్కులేదు


కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నమ్మకద్రోహం చేశారని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో పర్యటించడానికి వీల్లేదని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ నాయకులు, ఎఐటియుసి నాయకులు ర్యాలీ నిర్వహించి మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు పలికారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు వెలగల నాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.గిరి, మట్టా రామకృష్ణ, గోపాలం, రాంబాబు, అయినపర్తి మహేష్ పాల్గొన్నారు.

ముసునూరు: వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు వద్దు, ఉచిత విద్యుత్ కొనసాగించాలంటూ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు. శనివారం మండంలోని చక్కపల్లిగ్రామంలో ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు వ్యతిరేఖంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు ఆర్.లక్ష్మణరావు, చాట్ల పుల్లారావు, మల్లవల్లి మన్మథరావు, నాగేశ్వరరావు, జగన్‌మోహనరావు, వెంకటేశ్వరరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



గ్రంథాలయానికి మైక్ సెట్ అందిస్తున్న పుప్పాల కార్తిక్

గ్రంథాలయ అభివృద్ధికి సొసైటీ సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయం అభివృద్ధికి భీమడోలు విశాల సహకార పరపతి సంఘం సాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని వైసిపి ఉంగుటూరు నియోజకవర్గ నేత, ఎంఎల్ఎ సోదరులు పుప్పాల కార్తిక్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు భీమడోలు సొసైటీ సహకార సంఘం రూ.7500 విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుప్పాల కార్తిక్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సొసైటీ తరపున పాలక మండలి చైర్‌పర్సన్ ఆర్.సత్యశ్రీనివాస్, పర్సన్లు సవలం నాని, కె.భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాంబాబు మైక్‌సెట్‌ను శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు టివి.ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు రామకుర్తి నాగేశ్వరరావు, గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావులకు అందించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా కొండలరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



కొండలరావు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా చిట్టిబొమ్మ కొండలరావు ఎన్నికయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో గుడివాడలో రెండు రోజులు నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీ 56 మందితో ఎన్నికైంది. ఆ కమిటీలో జీలుగుమిల్లి మండలం నుంచి కొండలరావుకు అవకాశం దక్కింది. గత 30 ఏళ్లుగా భవన నిర్మాణ కార్మిక రంగంలో పని చేస్తూ కార్మికుల హక్కుల కోసం నిర్వహించిన పోరాటాల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నిక పట్ల సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, వివిధ సంఘాల నాయకులు కొండలరావుకు అభినందనలు తెలిపారు.

పామాయిల్ మొక్కలు ప్రాధాన్యత ప్రకారం ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ మొక్కలు ప్రాధాన్యత ప్రకారం రైతులకు అందించాలని ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పామాయిల్ మొక్కలను కంపెనీవారు ఇష్టమొచ్చినట్లు సరఫరా చేస్తున్నారని, దీంతో చిన్న సన్న కారు రైతులు మొక్కల కోసం నెలల తరబడి ఎదురుచూస్తూ నష్టపోతున్నారని తెలిపారు. ఈ మేరకు ఈ విషయాన్ని నూజివీడు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రాధాన్యత ప్రకారం మొక్కలు సరఫరా చేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

పేదల ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటాం : టిడిపి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇల్లు కూల్చివేతకు అడ్డంగా నిల్చుంటామని ఎఎంసి మాజీ చైర్మన్ తాడేపల్లి రామారావు అన్నారు. మండలంలోని బయ్యన్నగూడెంలో 60 ఏళ్లుగా చెరువు పక్కన ఇల్లు కట్టుకొని నివసిస్తున్నవారి ఇళ్లు కూల్చివేస్తామని ప్రభుత్వ అధికారులు నోటీసులు ఇవ్వడంతో టిడిపి నాయకులు బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎఎంసి చైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ బయ్యన్నగూడెంలో పేదలు, బడుగు బలహీన వర్గాల వారు గ్రామపంచాయతీకి అన్ని పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు వారి ఇళ్లు కూల్చాలనుకోవటం దారుణమన్నారు. బాధితులకు తాము అండగా ఉంటామన్నారు. 40 ఏళ్లుగా పేదల వద్ద నుంచి పన్నులు కట్టించుకున్న పంచాయతీవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పారేపల్లి వీరస్వామి, ఉపాధ్యక్షులు బాలం గంగాధర్, పారేపల్లి బుజ్జిబాబు, కవడకంటి గంగాచార్యులు, గండికోట పరమేష్, ముదునూరి రమణ, ఉదండం లెజెండ్, పారేపల్లి నరేష్, పారేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ప్రొజెక్టర్ పరికరాలు ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నందాపురం పిహెచ్‌సిలో రూ.2.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆటో అనలైజర్, ప్రొజెక్టర్ పరికరాలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఇమ్మణి రాజేశ్వరి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సురేష్, వైసిపి నాయకులు రత్నాజీ, సత్యనారాయణ, మోహనరావు, శివాజీ, టిడిపి నాయకులు నల్లూరి కృష్ణమోహన్, ఆసుపత్రి సిబ్బంది, కొండేపాటి రామకృష్ణ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న ఎంపిపి సత్యనారాయణ

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదలందరికీ ఇళ్లే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ సొంత ఇల్లు కల్పించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధ, తహశీల్దార్ కె.శ్రీనివాస్, పెదగొన్నూరు ఎంపిటిసి సభ్యులు టి.ఏసు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కార్తీక వన సమారాధన కార్యక్రమాల ద్వారా ఐక్యతతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని ఆగిరిపల్లి మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.జ్ఞానసుందరం, ఎం.జోగిరాజు అన్నారు. ఆగిరిపల్లి మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వనసమారాధన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి.అనురాధ, జె.వెంకటేశ్వరరావు, చక్రధర్, అజరయ్య, కృష్ణ, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : ముసునూరు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, సచివాలయం సిబ్బంది కలిసి శనివారం వన సమారాధన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొలగాని రాజానాయన, జెడ్‌పిటిసి సభ్యులు వరకాలే ప్రతాప్, ఎంపిపి రావుల కృష్ణకుమారి, సుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు ముల్పూరి నాగవల్లేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ కూచిపూడి సాయిరాణి, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్ పాల్గొన్నారు.

తమ్మిలేరు.. తవ్వేస్తున్నారు..!

జోరుగా ఇసుక అక్రమ రవాణా
అధికారుల దాడులు నామమాత్రమే
పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు



ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే, వలసపల్లి, ఎల్లాపురం, తమ్మిలేరు సరిహద్దు గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అధికారులు, పోలీసులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడితో ఉన్నతాధికారులు వాల్టాచట్టం ఉపయోగించడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. బలివే, ఎల్లాపురం, వలసపల్లి, గుళ్లపూడి గ్రామాల నుంచే కాకుండా సరిహద్దు గ్రామాలైన ధర్మాజీగూడెం, విజయరాయి, రామచంద్రపురం, రాయుడుపాలెం పలు గ్రామాల్లోని కొందరు ట్రాక్టర్లలో, టాటా ఏస్ వాహనాల్లో, ఎద్దుల బండుల్లో తమ్మిలేరులోని ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇళ్ల వద్ద, తోటల్లో పెద్ద పెద్ద గుట్టలుగా ఇసుకను ఉంచుతున్నారు. ఆ ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇంటి నిర్మాణంలో ఇసుకకు సుమారు రూ.లక్ష ఖర్చవుతుందని పేదలు వాపోతున్నారు. అధికారులు వచ్చి వెళ్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీస్‌స్టేషన్‌లో రోజుకోక కేసు నమోదవుతుందని, వాహనాలను సీజ్ చేస్తున్నారని, రాజకీయ నాయకుల ఒత్తిడిలతో యధావిధిగా మళ్లీ ఇసుక అక్రమ రవాణా సాగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో 450 కేసులు రాజీ

ప్రజాశక్తి - చింతలపూడి

లోక్ అదాలత్‌లో 450 కేసులు రాజీ అయినట్లు చింతలపూడి సివిల్ జడ్జి ఇబ్రహిం షరీఫ్ తెలిపారు. చింతలపూడి పట్టణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి నేర రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో 450 కేసులు రాజీ అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సామయ్య, ఎంఎంవిఎస్.మల్లేశ్వరావు, చింతలపూడి సిఐ, నరుకుళ్ల సత్యనారాయణ, బార్ ప్రెసిడెంట్, లోక్ అదాలత్ సభ్యులుగా పట్నాల శ్రీనివాసు, అడ్వకేట్ మెంబర్, అక్బర్ అలీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

భీమడోలు : రాజీ మార్గాల ద్వారా రెండు పక్షాల వారికి సంతృప్తి కలిగేలా కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ కార్యక్రమం సహకరిస్తుందని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం న్యాయమూర్తి టిఎస్ఎస్ఆర్ఎ.రిషిక్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం భీమడోలు కోర్టు వేదికగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 110 కేసులు పరిష్కారమయ్యాయని న్యాయస్థానం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిపి గంగాధరరావు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మండలం వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం తాటియాకులగూడెం, స్వర్ణవారిగూడెం పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో తహశీల్దార్ ఎలీషా, ఎంపిడిఒ మంగతాయారుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అవాస్‌లో మంజూరైన 110 ఇళ్లకు సంబంధించి పనులను ప్రారంభించాలని హౌసింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎపిఎం రామారావు, ఎపిఒ జాన్‌వెస్లీ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలో ప్రధానమంత్రి యోజన పథకంలో మంజూరైన గృహాలను మండల ప్రత్యేక అధికారి పాండురంగారావు శనివారం పరిశీలించారు. ఆరుగొలనుపేట, చిత్తపూరు, జనార్ధనవరం గ్రామాల్లోని గృహాలను ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం రూ.1.85 లక్షలు మంజూరు చేస్తుందని, 20 టన్నుల ఇసుక ఉచితంగా ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, వంద బస్తాల సిమెంటు రాయితీపై అందిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు గృహాలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు, ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, ఇఒపిఆర్‌డి ఎం.నాగరాజు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.రవి, గ్రామ సర్పంచి పుచ్చకాయల అప్పిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు పోతిరెడ్డిపల్లి కృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

జంగారెడ్డిగూడెం : కార్తీకమాస ఉత్సవాల నేపథ్యంలో మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కళాకారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి యాత్రికులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాస ఉత్సవాల నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా పైడిపర్రుకు చెందిన సీతారామాంజనేయ భజన మండలి, రేపల్లెకు చెందిన లక్ష్మి గణపతి భజన మండలి, మేదినరావుపాలేనికి చెందిన వెంకటేశ్వర భజన మండలి బృందాలు మద్ది ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కోలాట నృత్య ప్రదర్శన చేశారు.

పందుల స్వైరవిహారం.. వరిపంట నాశనం



పందుల స్వైరవిహారంతో నాశనమైన వరి పంట

ప్రజాశక్తి - చింతలపూడి

పందుల స్వైర విహారంతో వరి పంట నాశనమైంది. వెలమపేట వద్ద ఉన్న వరి పంటలపై పందులు విరుచుపడి పంటను మొత్తం ధ్వంసం చేశాయి. చేతికొచ్చిన పంటను పందులు నాశనం చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పందులు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పందులు ఇంటి చుట్టు పక్కల పరిసరాలు నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేసి, పందుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అమెరికా సేవా సంస్థ సాయం అభినందనీయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తాగునీటి సమస్య పరిష్కారానికి అమెరికాకు చెందిన హార్ట్స్ ఎఫైర్ స్వచ్ఛంధ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించడం సంతృప్తినిచ్చిందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ జోయ్ సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక 17వ వార్డులో దాత డాక్టర్ జోయ్ అందించిన రూ.ఎనిమిది లక్షలతో బోరుబావి నిర్మించడంపై హర్షం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు మేడవరపు విద్యాసాగర్ పట్టణ ప్రజల తరపున డాక్టర్ జోయ్ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జోయ్ మాట్లాడుతూ హార్ట్స్ ఎఫైర్ అనే క్రిస్టియన్ సంస్థను యుఎస్ఎలో నెలకొల్పి ప్రపంచంలోని అనేక దేశాల్లో మానవతా దృక్పథంతో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము స్థానికంగా వేసిన బోర్‌వెల్ పట్టణంలోని ప్రజలందరికీ ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గెడ్డం జాషువా, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు, వలవల తాతాజీ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వీధి దీపాలు ప్రారంభం



వీధి దీపాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

జగనన్న కాలనీల లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయడం ఆనందదాయకమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో జగనన్న కాలనీలో విద్యుత్ లైన్, వీధి దీపాలను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ప్రజలకు ఇబ్బందిలేకుండా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జగనన్నకాలనీ నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తాము ఇంత త్వరగా ఇళ్లను పూర్తి చేయడానికి ఎంఎల్ఎ సహకారం ఎంతో ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు డిఎన్ఆర్‌ను సన్మానిం చారు. సర్పంచి బోయిన విమలా భర్త రామరాజు త్వరితగతిన కాలనీకి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి అన్ని విధాలుగా గ్రామస్తు లకు సహకారం అందించిన డిఎన్ఆర్‌ను, విద్యుత్ శాఖ అధికారు లు ఇఇ రామకృష్ణను, డిఇఇ దశరధన్‌ను, ఎఇ పి.రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సునీత, రాధ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ నేతలు బొర్రా శేషుబాబు, ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, ఆర్.కొండ, విద్యుత్ ఎఇ పేర్ని రవికుమార్, పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

కార్పొరేట్ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలందించడం అభినందనీయమని సర్పంచి మణిజాన్ అన్నారు. మండలంలోని ఆటపాక పక్షుల కేంద్రం సమీపంలో ఆశ్రమం ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆకివీడు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పేదలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సూర్యనారాయణరాజు, సిఐ వైవిఎల్.నాయుడు, గ్రామ పెద్దలు, వైద్యులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య సేవలు

చింతలపూడి : మానవత చింతలపూడి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించినట్లు యర్రగుంటపల్లి సర్పంచి తుల్లిమిల్లి రాణి చెప్పారు. యర్రగుంటపల్లిలో కారుమూడి రమేష్ రెడ్డికి చెందిన రాధా గార్డెన్స్ ఫంక్షన్‌హాలులో ఆశ్రమ హాస్పటల్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అవసరమైనవారికి మానవత ద్వారా ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. ఆశ్రమ హాస్పిటల్ పిఆర్ఒ నరేష్‌సాయికిషోర్, ఆర్.ప్రవీణ్‌కుమార్, సురేంద్ర వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో యర్రగుంటపల్లి డైరెక్టర్ అన్నవరపు సత్యనారాయణ, ఛైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, అధ్యక్షులు కాంద్రేగుల నాగ చిన్నారావు, కార్యదర్శి అన్నవరపు రాజారావు, డైరెక్టర్ పుల్లూరి సోమశేఖరాచార్యులు, వైస్ ఛైర్మన్ ముప్పిడి సామ్యూల్, పిడపర్తి ముత్తారెడ్డి, తుల్లిమిల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ట్రెండ్ సత్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

మండలంలోని కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ, గంగన్నగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బిబివి.రావు ఇరువురు తూర్పుగోదావరి జిల్లాలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రెండ్ సత్కారాలను అందుకున్నారు. సమాజంలో విద్యార్థుల్లో, యువతలో పెట్రేగిపోతున్న నిరాశ నిస్పృహలు, ఆత్మహత్య ఆలోచనల నుంచి రక్షించే యోచనలో సామాజిక బాధ్యతను స్పందన ఈద ఇంటర్నేషనల్ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో అంకితభావం కలిగిన ఉబోధనా రంగంలో విశేషా అనుభవం కలిగిన ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వంద మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో తాము కూడా ఉన్నామని, స్వచ్ఛందంగా యువతకు, విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుందని వెంకటరమణ, బిబివి.రావు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు శామ్యూల్ రెడ్డి, సెంట్రల్ జైలు అధికారి ఎస్.రాజారావు, మాజీ ఎంఎల్‌సి నల్లమల్లి శేషారెడ్డి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వారిని అభినందించారు.

జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు

జనసేన ఆధ్వర్యాన పలుచోట్ల కార్యక్రమాలు



చింతలపూడిలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్వాలంభనకు ఉపయోగించుకుంటుందని జనసేన పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. పట్టణంలో చీరాల మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మేకా ఈశ్వరయ్య మాట్లాడారు. జగనన్న గృహ నిర్మాణాల వద్ద, మంచినీటి, విద్యుత్ సౌకర్యాలు లేవని, ఇంటర్నల్ రోడ్లు లేవని చెప్పారు. నవరత్నాలు, జగనన్న ఇళ్ల నిర్మాణం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. జగనన్న ఇళ్లను పరిశీలిస్తామని తెలిపారు. టిడిపి హయాంలో ఇంటి నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయని, ఆయా లబ్ధిదారులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని చెప్పారు. జగనన్న ఇళ్లు..పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల ను చైతన్యం చేసి ప్రభుత్వాన్ని కదలించాలని జనసేన కార్యకర్త లకు పిలుపునిచ్చారు. మూడున్నరేళ్ల కాలంలో జగన న్న గృహలు ముందుకు వెళ్లటం లేదన్నారు.

ఏలూరు అర్బన్ : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు ఏలూరు నియోజకవర్గంలోని పోణంగి గ్రామంలో ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఇచ్చిన ఇల్లాస్థలాలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గం పోణంగి గ్రామంలో పేదలకు జగన్ రెడ్డి ఇచ్చిన ఇళ్ల స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇల్లాస్థలాలు కేటాయించిన చోట కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో కనీసం ఇసుక, సిమెంట్, కంకర, ఐరన్ వంటి రవాణాకు తీవ్ర ఇబందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, పోణంగి బాబు, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, మండల అధ్యక్షులు వీరంకి పండు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని పేదలకు వివాదాల్లేని స్థలాలు కేటాయించాలని జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పి.రాజవరంలో పేదల కోసం కేటాయించిన స్థలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.రాము, వీరంకి వెంకటేశ్వరావు, సతీష్ రెడ్డి, సాయి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రజలకు నివాసయోగ్యమైన స్థలాలను జగనన్న ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి ఎం.శివరామకృష్ణ డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లు–పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవినెక్కలం, నెక్కలం గొల్లగూడెం గ్రామాల్లోని జగనన్న కాలనీలను జనసేన నాయకులు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు జె.పవన్, ఉపాధ్యక్షులు ఎం.ఉమాసాయిమహేష్, రాజు, విష్ణు, సువర్ణ, ప్రసాద్, ప్రవీణ్, సురేష్ పాల్గొన్నారు.

'జిహెచ్‌హెచ్029 పత్తి విత్తనాలు మేలు'

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు, దాచారం, ఇసుకపాడు, లంకాలపల్లి, ప్రాంతాల్లో పత్తి పంటలను శ్రీరామ్ బయోసీడ్ జనటిక్ కంపెనీవారు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా కుక్కునూరుకు చెందిన రైతు అంగిరేకుల బాలాజీ శ్రీరామ్ బయోసీడ్ జనటిక్ వారి జిహెచ్‌హెచ్029 రకం పత్తి విత్తనాలు వినియోగించి అధిక దిగుబడి సాధించే దిశగా ప్రయత్నం చేయడంతో ఆ రైతును సన్మానించారు. ఈ సందర్భంగా కంపెనీ ఆర్ఎమ్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కొత్తరకం జిహెచ్‌హెచ్029 పత్తి విత్తనాలు ఉపయోగకరమన్నారు. పరిశీలించినవారిలో పలు గ్రామాలకు చెందిన అజీజ్, సోడే నాగరాజు, నాగేష్, వెంకటేష్, రాంబాబు, కంపెనీ టిఎమ్ తారకేశ్వరరావు ఉన్నారు.

హామీల అమల్లో వైసిపి ఆదర్శం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైసిపి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. గణపవరం మూడో సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మోర అలంకారం, ఎంపిటిసి సభ్యులు బి.సీతామహాలక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వైసిపి నాయకులు రొంగల శ్రీను, సిరపారపు శ్రీను, శెట్టి రాజా, తోట శ్రీనివాసు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : ముద్దరబోయిన

ప్రజాశక్తి - నూజివీడు

రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలన్నా, రానున్న తరాలకు బంగారు భవిత లభించాలన్న టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలోని ఒకటో వార్డులో డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలో శనివారం మన ఇంటికి మన ముద్దరబోయిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలో కనీస వసతులు లేవని, డ్రెయినేజీలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం కూడా చేయలేదని చెప్పారు. ఎంఎల్ఎ ప్రతాప్ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఆయన అభివృద్ధి ఏమిటో చూపాలని సవాల్ విసిరారు.

నేరాలు-ఘోరాలు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆటపాకలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...భీమవరానికి చెందిన వి.త్రినాథరావు(53) ఏలూరులో బంధువుల ఇంటి వద్ద అయ్యప్ప మాలాధారుల బిక్షలో పాల్గొని తిరిగి బైక్‌పై భీమవరం బయలుదేరాడు. ఈ క్రమంలో ఆటపాక వద్దకు వచ్చేసరికి ఐసర్ వ్యాన్ అతడిని వెనుక ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సిఐ వివిఎల్.నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వీధి కుక్కల దాడిలో చిన్నారి గాయాలపాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తారకరామానగర్ దేవుడు మన్యంలో నివాసం ఉంటున్న కె.బాలు, నాగమణి దంపతుల కుమార్తె కె.కరుణ(6) రెండో తరగతి చదువుతుంది. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామంలో ఉన్న కిరాణా షాపు వద్దకు వెళ్లి తినుబండారాలు కొనుక్కుని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో వీధి కుక్కలు దాడి చేశాయి. ఇది గమనించిన స్థానికులు కుక్కలను బెదరగొట్టారు. కుక్కల దాడిలో గాయాలపాలైన చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు ఎక్కువగా సంచరిస్తూ పాదచారులపై, ద్విచక్రవాహనదారులపై వెంబడిస్తూ దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబధిత అధికారులు స్పందించి గ్రామ ప్రజలను కుక్కల దాడి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఇబి అధికారులు సీజ్ చేశారు. మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా పి.రాజవరం కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఇబి సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు స్వామి, ప్రవీణ్ రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.